# అంధకారం

రచన: శ్రీ తమ్మిశెట్టి రామారావు.

ఆది పెద్ద సిటీ: ఏదో షాపు ముందు జనం గుమిగూడారు. అందులో నుండి ఒక కంఠధ్వని-

మోసం సార్! మీ చేతిలో వున్న వందరూపాయలనోటు నే నిచ్చిందే? బేరం గొడవలో పడి మర్చిపోయినట్లున్నారు. జ్ఞాపకం తెచ్చుకోండి సార్!. గుర్నాథం గొంతు ఆక్రోశించింది.

ఏంటయ్యా? నీ వనేది వందరూపాయల నోటు నీవిచ్చిందా?... కాదు. ఇదిగో వీరు, బి. కాంప్లెక్స ఇంజక్షనకని, టాబ్లెట్సు కని యిచ్చారు. ఏమండీ!మీరిచ్చిందే కదూ?... షాపు యజమాని ఆ పెద్దమనిషి వైపు తల త్రిప్పి ప్రశ్నించాడు.

అవునండీ! నే నిచ్చినదే! ఆ పెద్ద మనిషి గొంతులో ఏదో జంకుతో కూడినధ్వని.

కాదుసార్! అది నే నిచ్చినది. సార్! సార్! అలా అనకండి సార్! ఒక్కసారి చూడండి సార్! నే నిచ్చినది ఆ నోటే......చుట్టూ జనం తెల్లబోయి చూస్తున్నారు.

ఏమిటయ్యా? నీన్యూసెన్సు. చెప్తుంటే నీకు కాదు, ఎంతని చూడను. గల్లాపెట్టెలో అన్నీ ఒకట్లు, రెళ్లు, ఐదులే. వుంటే నీ వందరూపాయలనోటు కనబడదా?. ఇది వీరిచ్చినది, షాపు యజమాని సమాధానం.

లేదు సార్! నాకు బాగా గుర్తుంది. మీరే మాటల్లో పడి మర్చిపోయుంటారు. పొరపాటుపడి వుంటారు, ప్లీజ్! నామాట నమ్మండి.

ఏంటయ్యా! నీ గొడవ, చెప్పేది నీకు కాదూ! ఎన్నిసార్లని చెప్పాలి నీవు యివ్వలేదని...అసలు నీ వుద్దేశ్యమేమిటి? ఆయనివ్వలేదనేనా? షాపు యజమాని గద్దింపు.

ఆ గద్దింపు చూసి ఆ పెద్దమనిషి మొహంలో విజయగర్వం, పెదవులపై విషయంతో కూడిన చిరునవ్వు.

సార్! మీరైనా చూడండి.మీరు మరోలా అనుకోక, తమ జేబులు ఒకసారి తనిఖీ చేయండి సార్! ఆ దీనుని దీనాలాపం.

ఆ మాటలకు ఆ పెద్దమనిషికి చెప్పలేనంత రోషం వచ్చేసింది. మోసం మీద కొకసారి చెయ్యిపోనిచ్చి-

ఏందయ్యా? నీ దబాయింపు. ఆ నోటునే నిచ్చిందని చెప్తుంటే వినబడ్డంలేదూ? ఎక్కడో పారేసుకున్నావో? లేక పొరపాటు పడ్డావో? నీ వాలకం చూస్తుంటే, ఏదో పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చినట్లుంది. ఆ పెద్దమనిషి వెటకారం చుట్టూవున్న గుంపులోంచి వికవికలు, పకపక్కలు. ఆ మాటలకి అభాగ్యుడి మనస్సు చివుక్కుమంది. లేదుసార్, నేను పిచ్చివాణ్ని కాదు, నాది పొరపాటుకాదు. బహుశా గ్రహపాటై వుంటుంది.

నా భార్యకి బాగులేకపోతే అమెరికన్ ఆస్పత్రిలో చేర్పించాను. అది చాలా సీరియస్ కేసని, డాక్టరుగారు మందులురాసిచ్చారు. అవి తీసుకురావాలంటే నాదగ్గిర చిల్లి గవ్వకూడా లేదు. నెలాఖరు రోజులు. అందులో నే చేసేది. యల్. డి. సి పోస్టు.

చాలీ చాలని జీతంతో సతమత మౌతూ సంసారాన్ని గడుపుతున్న నాలాంటివాళ్ళకు-కష్టాలువచ్చి పడితే కడతేర్చే నాధుడెవడు. నాభార్య మంగళసూత్రం తాకట్టు పెట్టి వందరూపాయలు అప్పు తెచ్చాను. కాలం కర్మం బాగోలేదు.

'ప్లీజ్! నామాట నమ్మండి. ఆ వెంకటేశ్వరుని సాక్షిగా ప్రమాణంచేసి చెప్తున్నాను? ఎదురుగావున్న ఫోటోవైపు వ్రేలు చూపిస్తూ అన్నాడు గుర్నాథం.

ఏంటయ్యా! నీ ప్రమాణాలు, పెడబొబ్బలూను. ప్రమాణాలు చేస్తే మేము నమ్మేస్తామనా? షాపుయజమాని, ఆ పెద్దమనిషి ఒకేసారి గొంతు కలిపారు. చుట్టూ మూగినవాళ్ళు కిది పాలుపోలేదు.

అవును సార్! మీకు మనుషులమీద, దేవుళ్లమీద నమ్మకాలేముంటాయి?. అసలు మీ మీద మీకే నమ్మకాలుండవు...గుర్నాథం మనసు విరిగి గట్టిగా అన్నాడు.

ఏంటయ్యా! నెమ్మదిగా చెప్తే వినేటట్టులేవు పోలీసుల్ని పిలవాలా! షాపు యజమాని ఆఖరిమాట. చేరిన పెద్దమనుషుల్లోంచి ఒక్కరూ తన పక్షం లేరు.

వద్దు సార్! వెళ్ళిపోతున్నాను. మా రోజులు బాగోలేదు. ఉంటూ వాళ్ళిద్దరివైపు అసహ్యంగా చూసి, వెనక్కి తిరిగాడు గుర్నాథం జనాన్ని తప్పుకుంటూ-నడుస్తున్నాడే గాని, మనస్సు మనస్సులోనే లేదు. ఏమిటీ మోసం. మనష్యులు యింత అవినీతికి దిగజారిపోతారా? యీ మనుష్యుల మనిపించుకున్న వారి మనస్సులో, మోసం ద్వేషం, కుళ్ళు...యిదేనా? మంచి, మనసు, వీళ్ళలో లేవా?.

కష్టాల్లో కొట్టుకు పోతున్న వాళ్ళమీద వీళ్ళకి రవ్వంత సానుభూతి లేదే?

ఎందుకిలాంటి మోసం జరిగింది. తనిప్పుడేంజేయాలి, ఎక్కడ ముట్టెత్తాలి, ఎవర్ని అడగాలి,

హే! భగవాన్ మాకెందుకీ శిక్ష విధించావు. మొట్టమొదటనుండి చిట్టచివరిదాకా నా బ్రతుకు మోసాలకే బలై పోవాలా? నీకేం? ఎక్కడో దాక్కొనివున్నావు. అన్యాయాలు అక్రమాలు అంటే నీకూ భయమేకాబోలు. అందుకే అవి చేసేవాళ్ల జోలికి పోవు. యింక మాబోటి పేద జనులు యింకే దేవునితో మొరపెట్టుకోవాలి.

గుర్నాథం అడుగులు నీరసంగా పడుతున్నాయి. కర్తవ్యంకోసం అన్ని కోణాల్లోంచి ఆలోచిస్తున్నాడు. ఆ రోడ్డుమీద ఎందరో నడుస్తున్నారు. వారి నడకల్లో హుషారుంది. ఆ రోడ్డుప్రక్క షాపుల్లోకి ఎందరో ప్రవేశిస్తున్నారు. వారి మనస్సులో ఆనందముంది. వచ్చేపోయే అమ్మాయిలున్నారు వారి రూపురేఖల్లో అందముంది. వీరందరితో కూడిన మెయిన్ రోడ్డు కాబట్టి ఎంతో సందడిగా వుంది. కాని గుర్నాధానికి ఆ లోకంతో సంబంధంలేనట్టుగా వుంది. వచ్చేపోయే సిటీ బస్సులు-కార్లు. ఎక్కడో నవ్వుల గలగలలు.

ఏయ్! మిస్టర్! కాస్త చూసుకొని నడు, కాస్తంతలో తప్పిపోయావు కాని కారుక్రింద పడేవాడవు బీటు జవాన్ కేక. అవును క్షణంలో తను చావునుండి తప్పించుకున్నాడు. చావుమాట గుర్తుకు రాగానే తన భార్య శారద గుర్తుకువచ్చింది. అవును శారద కెలాగుందో తొందరగా వెళ్ళాలి.

ఫుట్‌పాతు ఎక్కి గబగబా నడుస్తున్నాడు గుర్నాథం. కాని మెదడు ఆలోచిస్తునే వుంది. ఛా. తను చచ్చిపోయినా బాగుండేది. చావు కూడ తన్ను మోసంచేసిందేమో. మనస్సులో మళ్లీ అగ్నిపర్వతాలు రగులుకున్నాయి.

లోకమంతా మోసమేనా? అందరూ మోసగాళ్లేనా? ఊహు!...తను నమ్మలేదు. లోకమంతా మోసంతో నిండిపోతే పాపం పూర్తయి ఎప్పుడో భగ్గున మండిపోయేది. అందురూ-అందరికి మోసాలు చేస్తున్నట్లులేదు. తనొక్కడికే మోసాలు జరుగుతున్నాయి. అవును తనొక్కడినే యీ సమాజం మోసంచేస్తున్నది. నడుస్తున్న గుర్నాథం మనస్సు గతాన్ని త్రవ్విపోస్తున్నది.

'ఏవోయ్! గుర్నాథం! పరీక్షలు బాగా రాసినట్టున్నావు. ఫస్టుక్లాసు కొట్టేస్తావని మావాడు ఒకటే చెప్పుతున్నాడు.' ఆ వూరి ఎమ్. ఎల్. ఏ గారి పరామర్శ.

'ఏమిటో! నాదేముందండి. ఏదో రాసాను. అన్నట్టు మీవాడుకూడ బాగా రాసాడు కదండీ?' తలొంచుకొనే గుర్నాథం జవాబు.

ఆ!...ఏం రాసుంటాడు. వాడిబొంద. ఎంత రాసినా, నీయంత బాగా రాసేదుస్తాదేమిటి? ఏదో డాక్టరు కోర్సు చదివిద్దామని నా ఆశ, కాని వాడికాయోగం లేనట్టుంది. అన్నట్టు నీ నెంబరెంతోయ్! లేని ఆపేక్ష ఒలకపోస్తున్నాడాయన.

చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు గుర్నాథం. పరీక్షా ఫలితాలువచ్చిన తర్వాత గాని ఆ మోసం తెలియలేదు. వాసు ఫస్టుక్లాసులో పాసయ్యాడు. గుర్నాథం కాలువ వంతెనదాటి రోడ్డు మలుపు తిరిగాడు. తన ఆలోచన మరో మలుపు తిరిగింది.

తన క్లాసుమేటు శారదని ప్రేమించి రిజిస్టరు మారేజి చేసుకున్నాడు. అదివిని ఆ వూరంతా కూడ బలుక్కుంది. తనకు రావలసిన వాటాయిమ్మని వాళ్ళ బాబాయిని అడిగేడు. దానికి వాళ్ళ బాబాయి సమాధానమేమిటి? అందులో మోసంలేదూ?.

యింకా ఆసేమిటిరా? గుర్నాథం! మీ నాన్న త్రాగుడికి, పేకాటకే సగం అయిపోయింది. మీ నాన్న చచ్చిపోయింతర్వాత ఎంతయిందనుకున్నావు? అన్నట్టు మీ అమ్మపోతే ఎంత ఖర్చుపెట్టానో నీకు తెలియనిదా? పైగా నీ చదువుసంగతి చూడు.

అన్యాయం బాబాయి. అన్యాయం. మా వాటా పదెకరాలమాగాణి, ఆరెకరాల మెట్ట భూమి, మూడెకరాల మెరక, రెండు డాబాలు, ఇవన్నీ వీటికే అయిపోయాయా. బాబాయ్! నన్ను మోసం చేస్తున్నావు. నేనొప్పుకోను. పది మందిలో, పంచాయితీ పెట్టిస్తాను. గుర్నాథం ఆవేశం వెళ్ళబోసాడు...

అయితే ఆ పదిమంది పెద్దమనుష్యులు ఏమన్నారో, ఇప్పటికీ గుర్తున్నది గుర్నాధానికి.

ఏంటో? గుర్నాథం. మీ బాబాయి నీకుమోసం చేస్తాడంటే నమ్మలేకుండా వున్నాము. కన్నకొడికివి కాకపోయినా అన్నకొడుకివి. నీకు ద్రోహం తలపెడతాడా? ఇదిగో చూపొక్క అతనురాసిన ఖర్చు జాబితా.

హాస్పిటల్ అల్లంతదూరంలో కనబడ్డంతో ఆలోచనకి బ్రేకు వేసాడు గుర్నాథం. శారద రూపం కళ్ళ ముందు కదులాడుతోంది. శారద తన్ను చూసి నవ్వుతుంది, మందులు తెచ్చినందుకు సంతోషిస్తుంది. శారదకి నయమైపోతుంది. పిల్లలిద్దరూ అమ్మని చూడాలని ఏడుస్తారు. నయమైపోగానే శారదని యింటికి తీసుకొనిపోవచ్చు. పిల్లలు అమ్మ వచ్చిందని సంబర పడిపోతారు. డాక్టరు ఫీజు నెలజీతం అందుకొని ఇచ్చెయ్యవచ్చును. ఇవే ఆలోచనలు. కాని తన స్థితి గుర్తుకువచ్చి బాధ మరింత అధికమైంది.

గబగబా హాస్పిటల్ వరండా దాటి గదిలోనికి వచ్చాడు గుర్నాథం. అప్పటికి శారద ముఖంపై తెల్లటి గుడ్డ కప్పేస్తున్నది నర్సు. డాక్టరు ఎదురయ్యాడు.

డాక్టర్! శారదకి ఎలాగుంది. ఆమెకి మందులు తేలేక పోయాను సార్! మీరే ఏదో కరుణించాలి, తను తొందర తొందరగా చెప్పుకు పోతున్నాడు గుర్నాథం.

సారీ! మిస్టర్! గుర్నాథం. శారదని బ్రతికించలేక పోయాము. అందుకు చాలా విచారిస్తున్నాను. శారద అంత్యక్రియలకు ఏర్పాటుచేయండి వస్తాను, అంటూ కదిలాడు డాక్టర్ సుధానిది. నర్సు ఆయన్ని అనుసరించింది.

ఆ మాటలు గొడ్డలి పెట్టులా తగిలాయిగుర్నాథానికి. హే!...భగవాన్! ఏమిటీ నీ లీల. ఎందుకు నాకీవిషమ పరీక్ష. నా జీవితంతో ఎందుకు చెలగాట మాడుతున్నావు. మంచికి పోతే మిగిలేది వంచనమాత్రమేనా?.

ఆఖరుకి నాశారద కూడా నన్ను మోసంచేసి వెళ్లిపోయిందా? బ్రతికినంత కాలం నామూలంగా ఏమి సుఖించిందామె. కష్టాలు కలిక వుపవాసాలని తప్ప, జబ్బు చేసిన భార్యకి గుక్కెడుమంతు పోయలేని అభాగ్యున్నయ్యాను. నాలాంటి వాడికిక విముక్తి లేదా? నాలాంటి అమాయకుల్ని ఈ సంఘం యింకా ఎంతకాలం మోసం చేస్తుంది. ముందుకు వస్తున్న దుఃఖంతో శారద బెడ్ దగ్గరకు వెళ్ళాడు. ముఖంమీద గుడ్డ తొలిగించి చూసాడు. ఆమె ముఖంలో ప్రశాంతం కనిపిస్తున్నది. మునుపటిలా చిరునవ్వు ఆమె పెదవులపై లేదు.

గుర్నాథం గుండెల్లో ఎవరో కత్తితో పొడుస్తున్నట్లుంది. పిచ్చిగా గదంతా కలయ జూసాడు, ఎదురుగా ఏసుక్రీస్తు శిలువ కనబడుతోంది.

'హే! భగవాన్ మానవ మాత్రుడనైన నాకే మోసం జరిగిపోయిందనుకుంటున్నాను. దైవస్వరూపుడవైన నీవు కూడ మోసం తలపెట్టిందీ మానవలోకం.' అని పిచ్చిగా గొణుక్కుంటూ శారద మొహంపై ఎప్పటిలా, గుడ్డ కప్పి గుడ్ల కప్పగించి చూస్తుండి పోయాడు. కళ్ళు యాగరాజలపాతంలా వున్నాయి.



శ్రీవిఠల్ ప్రొడక్షన్స్ & కో వారి
"బీదలపాట్లు" చిత్రంలో
చంద్రకళ_నాగేశ్వరరావు
చంద్రమోహన్.